క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

గన్నేరువరం : మండలంలోని ఖాసీంపేటలో శ్రీ మానసాదేవి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. మూడునెలలకు గాను రూ.2లక్షల 27 వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు బద్దం నర్సింహా రెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు బుర్ర ఎల్లయ్య, బద్దం మల్లారెడ్డి, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, ఆకెన రవీందర్, బద్దం తిరుపతి రెడ్డి, బద్దం రాజేశ్వర్ రెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, ఆడెపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

గంగాధర : ఈనెల 10న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు శనివారం పలుగ్రామాల్లో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. పార్టీలో నెలకొన్న అంతర్గత సమస్యలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

ఉచిత వైద్యశిబిరం

హుజూరాబాద్ రూరల్ : మండలంలోని చెల్పూర్‌లో శనివారం హన్మకొండ జిల్లాకు చెందిన అజరా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సర్పంచ్ నేరెళ్ల మహేందర్ గౌడ్ తెలిపారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి మార్కెటింగ్ టీం అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కథా, ఏరియా మేనేజర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్ రూరల్ : బహుజన సమాజ్ పార్టీ మండల కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడిగా రాంపూర్ గ్రామానికి చెందిన రామ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గిన్నారపు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మాటేటి అజయ్ గౌడ్, కార్యదర్శిగా మొలుగూరి రమేశ్, కోశాధికారిగా నేతల కుమార్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు బండారి సదానందం, రాష్ట్ర కార్యదర్శి దొడ్డ సమ్మయ్య, నార్త్ జోన్ మహిళా కన్వీనర్ ఆకినపెల్లి శిరీష, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మేకల రవీందర్, జిల్లా కార్యదర్శి అసెంబ్లీ ఇన్‌చార్జి మారేపల్లి మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా రమేశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రమేశ్

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ సీఐగా బార్పటి రమేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన సీఐ రామచందర్‌రావు జగిత్యాల టౌన్‌కు బదిలీపై వెళ్లగా కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ ఎస్‌బీ-2లో పనిచేసిన రమేశ్ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో హన్మకొండ జిల్లా కమలాపూర్ ఎస్ఐగా, ఖమ్మం జిల్లా కనకగూడెం, అశ్వారావుపేట, ఇల్లందు సీఐగా, కరీంనగర్ జిల్లాలో ఎస్‌బీలో పనిచేశారు. ఎస్సై యూనిస్ అహ్మద్, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బీమా చెక్కులు అందజేత

సైదాపూర్: మండలంలోని సైదాపూర్ పురుషుల పొదుపు సంఘంలో సభ్యులుగా కొనసాగుతూ, ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు మంజూరైన బీమా చెక్కులను మండల పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు పోగు రమేశ్ చెక్కులు అందజేశారు. సైదాపూర్‌కు చెందిన బత్తుల రవీందర్ మృతిచెందగా రూ.82,171, అనగోని మహేందర్ మృతిచెందగా రూ.91,931 పురుషుల పొదుపు సంఘం నుంచి మంజూరైన బీమా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు పైడిపల్లి రమేశ్, సభ్యులు సురేశ్, కార్తీక్, శ్రీధర్, పర్శరాములు, శ్రీనివాస్, రమేశ్, కిషోర్, రఫీ, అనగోని వీరన్న ఉన్నారు.

వైభవంగా గణపతిపూజ

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ శ్రీ లక్ష్మీగణపతి నవమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వాసుదేవ పుణ్యాహవాచనం, కలశస్థాపన, నవగ్రహపూజ, అంకురార్పణ స్వామి వారికి షోడశోపచార పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కారకులైన వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

దిద్దుబాటు చర్యలేవీ..!

- పాఠశాల స్థల రిజిస్ట్రేషన్‌పై వివాదం
- రద్దు చేయాలని మున్సిపాలిటీ తీర్మానం
- చర్యలు తీసుకోవడంలో తాత్సారం



జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

చొప్పదండి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదాన స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడంపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం జరుగుతోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న క్రీడామైదానం విద్యార్థులకే కాకుండా, వివిధ పోటీ పరీక్షల్లో ఫిట్‌నెస్ సాధించేవారికి ఉపయుక్తంగా ఉంది. ఈ క్రీడా మైదానం స్థలాన్ని మరోస్థలంగా చూపించి 2018లో చేసిన ఓ రిజిస్ట్రేషన్ ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. చొప్పదండి మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించి, మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన సమయంలో జరిగిన సదరు రిజిస్ట్రేషన్‌పై వచ్చిన ఫిర్యాదులతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇటీవలే విచారణ జరిపారు.

మున్సిపాలిటీ తీర్మానం

గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారుల లేఖలతో సంబంధం లేకుండా ఓ సంఘానికి పాఠశాల ఆధీనంలోని స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. గుంటస్థలం రూ.10 నుంచి రూ.50 లక్షల వరకు పలుకుతుండగా కార్యదర్శి రూ.వెయ్యికి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై వరుస ఫిర్యాదులు రాగా ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం అత్యవసర సమావేశంలో సదరు రిజిస్ట్రేషన్‌ను రద్దుపరుస్తూ తీర్మానం చేశారు. ఈ మేరకు కౌన్సిల్ తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపినట్లు అధికారులు ప్రకటించారు. రెవెన్యూ అధికారులు పాఠశాల స్థలం రెవెన్యూ రికార్డుల ప్రకారం లేదని అంచనాకు రావడంతో కబ్జాకు గురికాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఓపెన్ జిమ్ నిర్మాణంతో వివాదం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఓపెన్ జిమ్ నిర్మిస్తానని ఇచ్చిన హామీమేరకు క్రీడా మైదానంలో జిమ్ మంజూరైంది. పనులు చేపట్టగా ఆరునెలల క్రితం వివాదం తలెత్తింది. పనులకు ఆటంకం కలిగిస్తూ గుర్తు తెలియని వ్యక్తులు క్రీడా మైదానంలోని ఇనుప చువ్వలను కోసివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారి ఆచూకీ గుర్తించలేదు. తాజాగా ఓపెన్ జిమ్ పనులు పూర్తికాగా, త్వరలోనే ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ప్రకటించారు. కాగా అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసిన విధానంలో శాస్త్రీయత లేదని తెలిసినా, గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారే క్రమంలో చివరి నిమిషంలో చేసిన తప్పిదాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



ఎంతోమంది విద్యార్థులకు, క్రీడాకారులకు, ఉద్యోగార్థులకు ఉపయోగపడిన పాఠశాల క్రీడా మైదానం ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్ తరాలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దాలి.

– మావురం మహేశ్, చొప్పదండి

ఉన్నతాధికారులకు పంపించాం



గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో చేసిన రిజిస్ట్రేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని మున్సిపల్ తీర్మానం ఉన్నతాధికారులకు పంపించాం. పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకున్నాం.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

సాధారణ ప్రసవాలు పెంచాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాజిదా అతారి
- జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



బాలింతతో మాట్లాడుతున్న సాజిదా అతారి

జమ్మికుంట: ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి సాజిదా అతారి ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు వ్యాధి నిరోధకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ఉన్న ప్రతిఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న నిరాహార దీక్ష



మాట్లాడుతున్న నాయకులు

గన్నేరువరం : లోయర్ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మాణ సాధనకు ఈ నెల 10న మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు బ్రిడ్జి నిర్మాణ కమిటీ నాయకులు సంపతి ఉదయ్, పుల్లెల రాము కోరారు. గత ఎన్నికల్లో మండల సమీపంలోని మానేరు డ్యాం నుంచి కరీంనగర్ డ్యాం కట్టవరకు బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారని, వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. మండలానికి సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీక్షలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పుల్లెల జగన్, మంగరాపు రవి, బుర్ర పోచమల్లు, కాంతాల కిష్టారెడ్డి, కాల్వ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత



రోడ్డుపై నిలిచిన ఇసుక లారీలు

మానకొండూర్: ఇసుక లారీలతో రహదారి గుంతలుగా మారిందని, దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పచ్చునూర్‌లో శనివారం గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకున్నారు. గ్రామంలోని మహిళా సంఘం భవనం, ఎస్సీ కాలనీ సమీపంలో రహదారిపై తారు వేయలేదని, లారీలతో రోడ్డు గుంతలుగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గుంతలు పూడ్చాలని పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. అనంతరం ఇసుక క్వారీ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇకపై ఈదారి గుండా లారీలను నడపమని, ఓ కాగితంపై రాసివ్వడంతో గ్రామస్తులు ఇసుక లారీలను వదిలిపెట్టారు.

ఆకట్టుకున్న వీరబ్రహ్మేంద్ర స్వామి నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

చిగురుమామిడి : మండలంలోని ఇందుర్తిలో వీరబ్రహ్మేంద్ర స్వామి నాటక మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన బ్రహ్మంగారి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. రెండ్రోజుల పాటు జరిగే కార్యక్రమానికి శనివారం సర్పంచ్ అందె స్వరూపస్వామి నాటక ప్రదర్శనను ప్రారంభించారు. నాటక ప్రదర్శనలో పాల్గొన్నవారికి జిల్లా కమిటీ పక్షాన అధ్యక్షుడు వంగ సుధాకర్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అందెస్వామి, ఉపసర్పంచ్ తోట సతీశ్, లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ రఘునాథరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అందె చిన్నస్వామి, వార్డు సభ్యులు విష్ణుమాచారి, డాక్టర్ రాజేందర్, జిల్లా, మండల కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు పరుశరాములు, మొగిలి, లక్ష్మీనారాయణ, కొమురయ్య, భరత్ పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ ధరను రూ.10 లక్షలకు పెంచాలి

సైదాపూర్: రెండో విడత గొర్రెల పంపిణీలో రూ.10 లక్షలకు ఒక యూనిట్ పంపిణీ చేపట్టాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు పెద్ది తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. గొల్ల కురుమలకు ప్రభుత్వం ఇచ్చే గొర్రెల పంపిణీకి లబ్ధిదారులు వాటా ధనం చెల్లించి, ఐదేళ్లు, కావస్తుందనీ, ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేయాలన్నారు. కురుమలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం 21 గొర్రెలు యూనిట్‌తో లబ్ధిదారుడికి ఉపాధి కష్టంగా ఉందన్నారు. కనీసం 60 గొర్రెలతో పాటు గొర్రెల పాక, పశుగ్రాసంతో రూ.10 లక్షలకు యూనిట్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు శనివారం విరాళాలు అందజేశారు. బొజ్జం సుమన్ రెడ్డి 10,116, బోలవేన ఎర్రయ్య 10,116, రాయిశెట్టి లత-శ్రీనివాస్ 10,116లను ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొజ్జం తిరుపతి రెడ్డి, పోల్సాని రాజేశ్వర్ రావు, కనవేన రాజమల్లు, బండారి తిరుపతి, పర్లపల్లి రమేశ్, పర్లపల్లి నాగరాజు, అప్పని రాజు, ఎడ్ల శ్రీనివాస్, పోతరాజు కుమారస్వామి, పర్లపల్లి అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదు

హుజూరాబాద్ : రాష్ట్రంలో బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంటే కేంద్రంలోని బీజేపీ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. హనుమాన్ టెంపుల్ చైర్మన్ భూసారపు బాపురావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ గంట మధు, ఇప్పలపల్లి చంద్రశేఖర్, తులసీ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి: పట్టణంలోని మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మైనార్టీ ప్రతినిధులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి విన్నవించారు. పట్టణంలోని కబ్రస్థాన్ కాంపౌండ్ వాల్, షాదీఖానా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు, నూతనంగా ఏర్పాటు చేసిన ఈద్గాకు సీసీరోడ్డు, పలు గ్రామాల్లో కబ్రస్థాన్‌ల కాంపౌండ్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎండీ షఫీక్ రహమాన్ పాషా, ఖాజా అలీ, అజ్జు, అస్గర అలీ, జలీల్, ఇమామ్ ముసబ్బిక్, మున్వర్ అలీ, నాసర్, చాంద్‌మియా, రజాక్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

కబ్రస్థాన్ పరిశీలన

జమ్మికుంట: పట్టణంలోని పలు వార్డులోని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని కబ్రస్థాన్‌ను శనివారం పరిశీలించారు. 3వ వార్డు రామన్నపల్లి డ్రైనేజీ నిర్మాణంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 14వ అంబేద్కర్ జయంతి సందర్భంగా చౌరస్తాలో ఏర్పాట్లు పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఆయా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పానగంటి సంపత్, కౌన్సిలర్లు పాతకాల రమేశ్, మేడిపల్లి రవీందర్, సారంగం, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

హుజూరాబాద్ రూరల్ : ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన మొగిళి నరేశ్ (28) గ్రామంలో గొర్రెలు, మేకల విక్రయ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను తెలియరాలేదు.

ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్సీ, విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మల్లన్నపల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ

వీణవంక: ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లన్నపల్లి, రెడ్డిపల్లి, కొత్తపల్లి, బ్రహ్మణపల్లి, ఘన్ముక్కుల, బొంతుపల్లి, గంగారం గ్రామాల్లో మంజూరైన 19 కల్యాణలక్ష్మి చెక్కులు, పది సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మల్లన్నపల్లిలో యాదవ సంఘం భవన ప్రహరీకి రూ.5లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే రూ.1.30 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు గుర్తుచేశారు. ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల సాధవ రెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, పీఏసీఎస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కలకొండ మధుకర్‌రెడ్డి, మండల సంపత్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, డైరెక్టర్లు కట్కూరి మధుసూదన్‌రెడ్డి, చెక్కబండి శ్రీనివాస్ రెడ్డి, గొట్టిముక్కుల రవీందర్ రావు, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

జమ్మికుంట: పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లో 8 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, ఎంపీపీ దొడ్డె మమత ప్రసాద్, సర్పంచ్ వంశీధర్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్న కోమిటిపల్లిలో..

ఇల్లందకుంట: మండల పరిధిలోని చిన్న కోమిటిపల్లిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటి వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు. సర్పంచ్ చిట్ల సరోజన నాగన్న, నాయకులు ఎక్కటి సంజీవరెడ్డి, కుమారస్వామి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి'



నిరాహార దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు

చొప్పదండి : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కెనపల్లి కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో శనివారం టీ సేవ్ కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రశ్నప్రత్రాల లీకేజీ వ్యవహారంలో దోషులను గుర్తించాలన్నారు. ఇక్కడ రొడ్డవేని తిరుపతి, భట్టు రాజు, గీకురు హరీశ్, లిక్కిడి రవి, చిల్ల గణేశ్, చిల్ల మారుతి, శ్రీకాంత్, నాగరాజు, సంజీవ్, సాయి, అజయ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి..

మానకొండూర్ : సీఆర్ బీస్వాల్ కమిటీ మేరకు వెంటనే 1.91 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బ నీరజ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇక్కడ యనమండ్ల భాగ్యలక్ష్మి, ఆనంది కవిత, కొండ లక్ష్మీ, సరిత, నంద్యాల సుజాత, లక్ష్మీ, పురంద అనూష, సుమలత, రజిత, దేవక్క, స్వరూప, ఉయ్యాల రాం రెడ్డి, బాపు రెడ్డి, పొరండ్ల సంపత్, కనకం నారాయణ, శ్రావణ్, పటేల్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీజేపీ నాయకులు

మానకొండూర్ : అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు నియోజకవర్గ బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. మానకొండూర్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, భాషబోయిన ప్రదీప్, సొన్నాకులు శ్రీనివాస్, శ్రీనివాస్, కొండ్ర సురేశ్, కత్తి ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ఆర్టీసీ ప్రహరీ ధ్వంసం



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ప్రహరీ

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ స్థలంలో గతేడాది అనుమతి లేకుండా బాబూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అక్రమంగా విగ్రహాలను ఎలా ఏర్పాటు చేస్తారని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గతంలో అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధ రాత్రి మహనీయుల విగ్రహాల చుట్టూ ప్రహరీని కూల్చివేశారు. ఆర్టీసీ అధికారులు సుమారు వందమంది సిబ్బందితో బస్టాండ్ వద్దకు చేరుకొని పహారా కాస్తున్నారు. కొందరిపై ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేసినా చర్యలకు పాల్పడటం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల కొందరు నాయకులు జగ్జీవన్ రామ్ ముసుగు తీసి వేడుకలను జరిపారు. ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి ఉండడంతో శుక్రవారం అర్ధరాత్రి కొందరు నాయకులు జేసీబీతో విగ్రహాల చుట్టూ ఉన్న ప్రహరీని తొలగించారు. కరీంనగర్ డీఎం ప్రణీత్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

అధికార పార్టీ నేత ఆదేశాలతోనే..

నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి ఆదేశాలతోనే గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీని ధ్వంసం చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారంలో ఉంటూ మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు నోచుకోకపోవడం దురదృష్టకరమని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు నాయకులతో కలిసి ఆవిష్కరణ చేసేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చినట్లు తెలిసింది. ప్రహరీని పరిశీలించిన వారిలో కరీంనగర్ డిపో 2 మేనేజర్ మల్లయ్య. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ రవీందర్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

పారమిత విద్యార్థికి తపాలాశాఖ స్కాలర్‌షిప్

కరీంనగర్: ఇటీవల కరీంనగర్‌లో దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ఆధ్వర్యంలో తపాలాశాఖ నిర్వహించిన స్కాలర్‌షిప్ టాలెంట్‌టెస్ట్‌లో పారమిత పాఠశాల విద్యార్థి మెట్టు గణిత్‌సాయి రూ.6వేలు స్కాలర్‌షిప్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.ప్రశాంత్ తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా ప్రైవేటు పాఠశాలల నుంచి పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా గణిత్‌సాయిని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, ఆనంద్ కమలాకర్, బాలాజీ, సమన్వయకర్త జి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

కోరటపల్లిలో రన్ ఫర్ జీసస్

రామడుగు : మండలంలోని కోరటపల్లిలో శని వారం వెస్లీ యూత్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ మన్నె దర్శన్‌రావు ప్రారంభించారు. యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.